జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 4 | జనవరి | 2026 • పేజీలు : 7

# సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కృషి చేయాలి

**- జిల్లా రవాణా శాఖాధికారుల సమన్వయ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు**



**కొత్తగూడెం క్రైమ్, జనవరి 3 (ప్రజాజ్యోతి) :** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు – 2026లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీస్ శాఖ, రవాణా శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారులతో

మిగతా 2 లో...



# కాల్పులతో దద్దరిల్లిన... దండకారణ్యం...

- ఛత్తీస్గఢ్ లో ఎన్ కౌంటర్
- బీజాపూర్ లో ఇద్దరు మావోయిస్టుల మృతి,
- ఒక మహిళ, ఒక పురుషుడు మృతి ఒక్కొక్కరిపై ఐదు లక్షల రివార్డ్
- సుక్మా లో 12 మంది మావోయిస్టుల మృతి
- ఆయుధాలు, మృతదేహాలు స్వాధీనం
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

**చర్ల, జనవరి3, (ప్రజాజ్యోతి ):** ఛత్తీస్ గఢ్ లోని బస్తర్ డివిజన్ లో బీజాపూర్ ,సుక్మా ప్రాంతాలలో నక్సలైట్లు కు సైనికుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. రెండు ఆపరేషన్లలో భద్రతా దళాలు గణనీయమైన విజయాన్ని సాధించాయి. బీజాపూర్ లో ఎన్ కౌంటర్ స్థలం నుండి ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. సుక్మా ఎన్కౌంటర్ లో 12 మంది నక్సలైట్లు మృతి చెందారు .

**సుక్మాలో 12మంది మావోల మృతి :** సుక్మాలోని కిష్టారామ్ ప్రాంతంలో నక్సలైట్లపై డి ఆర్ జి సైనికులు శోధన ఆపరేషన్ లో, సైనికులు గణనీయమైన విజయాన్ని సాధించారు, డి వి సి ఏం మంగ్డుతో సహా అనేక మంది నక్సలైట్లను హతమార్చారు. నివేదికల ప్రకారం, కిష్టారామ్ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 12 మంది నక్సలైట్లు మృతి చెందారు. ఎన్ కౌంటర్ స్థలం

మిగతా 2 లో...

# 69 వ జాతీయ కబడ్డీ పోటీలకు 33 జట్లు రిజిస్ట్రేషన్ పూర్తి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 3, ప్రజా జ్యోతి:** పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 69వ జాతీయ కబడ్డీ పోటీలు జనవరి 7వ తేదీ నుండి ఘనంగా ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ,జాతీయ స్థాయి విద్యాసంస్థల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఈ పోటీలు అండర్–17 బాలుర విభాగంలో నిర్వహించబడనున్నాయని, మొత్తం 33 జట్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్,

మిగతా 2 లో...

# ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ అధికారులు

**ఫారెస్టు డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్ పట్టివేత**

**3.51 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ డిఎస్పీ రమేష్**



**కొత్తగూడెం, జనవరి 3 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ లో శనివారం ఏసిబి మెరుపు దాడి చేసింది. టీఎఫ్డిసి ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్, పై అధికారి డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణి కాంట్రాక్టర్ వద్ద నుండి జామయిల్ కట్ చేసిన బిల్లులు చెల్లించేందుకు 32 వేల టన్నులకు, 28 లక్షలు 80 వేలు లంచం డిమాండ్ చేశారు. టన్నుకు 750 ప్రభుత్వం ఇస్తుంది. 150 డిమాండ్ కాగా 90 బేరం కుదిరింది.మొదటి యూనిట్ లో 3900 టన్నులు కటింగ్ అయింది,ఆ బిల్లులు చేసేందుకు (ఎ3)గోపాలకృష్ణ ద్వారా 3 లక్షల 51 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పి వై. రమేష్ ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

## ఏ హెచ్ ఎస్ జి పి ఎస్ పాఠశాలలను

# ఐటీడీఏ పీవో ఆకస్మికంగా తనిఖీ

**- 10 ఫలితాలలో విద్యార్థులు 10కి 10 వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి**

**- ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలి**

**- ఐటీడీఏ పీవో బి రాహుల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 3, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని ఏ హెచ్ ఎస్ జి పి ఎస్ పాఠశాలలను శనివారం ఐటీడీఏ పీవో బి రాహుల్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు, ఈ సందర్భంగా పిఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏ హెచ్ ఎస్, జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులకు పునాది నుండే విద్యా వ్యవస్థ బలోపేతం

మిగతా 2 లో...



## కాల్పులతో దద్దరిల్లిన దండకారణ్యం...

(మొదటి పేజీ తరువాయి...)

నుండి ఒక ఏ కె –47, ఒక ఐ యెన్ ఎస్ ఏ ఎస్ రైఫిల్ ను స్వాధీనం చేసుకున్నారు, మొత్తం 12 మంది నక్సలైట్ల మృతదేహాలతో పాటు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

**బీజాపూర్ లో ఇద్దరు మావోయిస్టుల మృతి :**

బీజాపూర్ జిల్లాలోని బసగూడ పోలీస్ స్టేషన్ లోని గగన్ పల్లి–ముర్కిపార్ అటవీ కొండలలో శనివారం ఉదయం 05 గంటల నుండి డీఆర్ జీ బీజాపూర్ మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయి. బీజాపూర్ జిల్లాలోని బసగూడ పోలీస్ స్టేషన్ లోని గగన్ పల్లి–ముర్కిపార్ అడవిలో 10–15 మంది సాయుధ మావోయిస్టులు ఉన్నారనే సమాచారం ఆధారంగా, డీఆర్ జీ బీజాపూర్ శోధన ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఆపరేషన్ సమయంలో శనివారం ఉదయం 5.00 గంటల నుండి బీజాపూర్ డి ఆర్ జి మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇప్పటివరకు, సెర్చ్ ఆపరేషన్ సమయంలో ఎన్ కౌంటర్ సైట్ నుండి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు, ఎస్ ఎల్ ఆర్ రైఫిల్, 12 బోర్ కంట్రీ మేడ్ పిస్టల్ తో పాటు పేలుడు పదార్థాలు మావోయిస్టు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు అని అన్నారు .

**ఎన్ కౌంటర్ లో మరణించిన మావోయిస్టుల గుర్తింపు:**

ఏసిఏం హుంగా మడ్కం అలియాస్ పంచుగ, తండ్రి పోజ్జా, పూర్వతి గ్రామం, పోలీస్ స్టేషన్ జగర్గుండ, ఏ సి ఏం పమేడ్ ఏరియా కమిటీ, ఐదు లక్షల రివార్డు ఉన్నది .పీ పీ సి ఏం ఆయిటి ముచాకి అలియాస్ జోగి, పమేడ్ ఏరియా కమిటీ, రివార్డు – రూ. 5 లక్షలు

**ఆయుధాలు , ఇతర సామగ్రి స్వాధీనం:**

ఒక – ఎస్ ఎల్ ఆర్ రైఫిల్, ఒక మ్యాగజైన్ 09 రౌండ్లు , ఒక – 12 బోర్ కంట్రీ మేడ్ పిస్టల్, 05 రౌండ్లు ,స్కానర్ సెట్ ఒక ముక్క, కార్డెక్స్ వైర్, మావోయిస్టు బ్యాక్ ప్యాక్, మావోయిస్టు సాహిత్యం మొదలైన సామగ్రి ని బలగాలు స్వాధీనం చేసుకున్నారు.

## 69 వ జాతీయ కబడ్డి పోటీలకు 33 జట్లు రిజిస్ట్రేషన్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి...)

జమ్మూ కాశ్మీర్, బిహార్, అస్సాం, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మణిపూర్, త్రిపుర, గుజరాత్, ఢిల్లీ, చండీగఢ్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో పాటు దాద్రా & నగర్ హవేలీ , డామన్ అండ్ డియూ కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని వివరించారు. అదేవిధంగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కె వి ఎస్) నవోదయ విద్యాలయ సమితి (ఎన్ వి ఎస్) సీబీఎస్ ఈ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్, సీఐఎస్ సీఈ ( విద్యాభారతి వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థల జట్లు కూడా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టు నుంచి 6 నుంచి 12 మంది క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు, కోచ్ లు, అధికారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రత, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు, ఈ జాతీయ క్రీడా ఈవెంట్ ను విజయవంతంగా నిర్వహించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరింత పెంచేలా సంబంధిత శాఖలు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు.

## ఏ హెచ్ ఎస్ జి పి ఎస్ పాఠశాలలను

# ఐటీడీఏ పీవో ఆకస్మికంగా తనిఖీ





(మొదటి పేజీ తరువాయి...)

కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ టు లోని అంశాలు ప్రతి పిల్లవానికి అందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని , అదేవిధంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో పరీక్షలు బాగా రాసి 10/10 ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత హెచ్ఎంలు సబ్జెక్ట్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ముందుగా ఏ హెచ్ ఎస్ పాఠశాలను సందర్శించి పదవ తరగతి పిల్లలతో ప్రత్యేకంగా సమావేశమై పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రతి సబ్జెక్టును శ్రద్ధగా చదువుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు ,ఈ పాఠశాలలో ఇంగ్లీష్, గణితం, సైన్స్, తెలుగు సబ్జెక్టులలో పిల్లలు చాలా వెనుకబడి ఉన్నారని సంబంధిత ఉపాధ్యాయులు ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించి మరుసటి రోజు దానికి సంబంధించిన స్లిప్ టెస్టులు జరిపి పిల్లల యొక్క నైపుణ్యతను పరిశీలించాలని అన్నారు. సంబంధిత హెచ్ఎం పూర్తిస్థాయి బాధ్యత తీసుకొని పిల్లలందరూ పదవ తరగతిలో ఉత్తీర్ణుల య్యేలా చూడాలని, గత సంవత్సరం ఈ పాఠశాలలో పదవ తరగతి ఫలితాలు చాలా నిరుత్సాహ పరిచాయని ఈ సంవత్సరం 100% ఫలితాలు వచ్చేలా చూడాలని అన్నారు. అనంతరం జిపిఎస్ పాఠశాల సందర్శించి పిల్లలకు ఉపాధ్యాయుని పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు , చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెల రోజుల తర్వాత తప్పనిసరిగా ఈ పాఠశాలను సందర్శిస్తానని, ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలని అన్నారు. ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వాహణ తప్పనిసరిగా పిల్లలు అర్థం చేసుకొని రాసేలా ఉపాధ్యాయులు పిల్లలను ఉత్తేజపరచాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ జి హెచ్ ఎస్ పాఠశాల హెచ్ఎఫ్ బద్రు, జిపిఎస్ పాఠశాల ఎస్జిటి ఉపాధ్యాయుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కృషి చేయాలి.



(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. జనవరి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నిర్దిష్ట సైన్ బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించే విధంగా నిత్యం వాహన తనిఖీలు చేపట్టి, అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలకు విద్యార్థులను తరలించడానికి ఉపయోగించే బస్సులు, వాహనాల విషయంలో ఖచ్చితమైన నియమ, నిబంధనలను పాటించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై నిత్యం వాహన తనిఖీలు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పొగమంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్సుల ఫిట్ నెస్ ను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్బి ఇన్స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్, డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాస్, మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్స్ వి.వెంకటరమణ, డి.మనోహర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్స్ ఫారుక్, రాజశేఖర్ రెడ్డి, అశోక్, రాకేష్,శ్వేత, మానస తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో మాజీ కౌన్సిలర్ హల్ చల్!

**–రెండు రోజుల క్రితం గోవింద్ సెంటర్ లో వీరంగం**

**–మద్యం మత్తులో వాహనదారులపై దౌర్జన్యం**

**–దుర్భషలాడిన ఓ మాజీ కౌన్సిలర్**



**ఇల్లందు, జనవరి 3, ప్రజాజ్యోతి:** ప్రజాప్రతినిధులను ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నుకోవడం జరుగుతుంది. వారి పదవి కాలం పూర్తయిన కానీ ఇదే విదంగా హుందాగా వ్యవహారించాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలో కొందరు వారి హోదాను మరచి ఇస్తానుసారంగా రోడ్లపై హల్ చల్ చేయడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని జనవరి ఒకటో తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఓ మాజీ కౌన్సిలర్ మద్యం మత్తులో గోవింద్ సెంటర్ లోని రెండు వైన్ షాప్ సమీపంలో హల్ చల్ చేసినట్టు సమాచారం. సదరు మాజీ కౌన్సిలర్ తీవ్రంగా మద్యం సేవించి వాహనదారుల అడ్డుకొని వారిని దుర్భాషలాడుతూ ఈ ఏరియా నాది అంటూ వారిని అడ్డుకొని వీరంగం చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఓ వార్డుకు మాజీ కౌన్సిలర్ గా ఉండి ఆదర్శంగా ఉండాల్సిన ఆ ప్రజాప్రతినిధి మద్యం మత్తులో వీరంగం చేయడాన్ని ఆ ప్రజాప్రతినిధి తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి వ్యక్తులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నందుకు ఆ ప్రాంత వార్డు ఓటర్లు సిగ్గుపడే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ మాజీ కౌన్సిలర్ వీరంగం విషయం తెలుసుకున్న పలువురు ఆయన వెంట తిరిగేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సదరు ఆ మాజీ వార్డు కౌన్సిలర్ తీరు మార్చుకోవాలని ప్రజలు సూచిస్తున్నాయి.

# ప్రజా సేవే లక్ష్యంగా పర్యటన కొనసాగుతుంది

- పినపాక మండల పర్యటనలో మాజీ ఎమ్మెల్యే రేగా
- పలు కుటుంబాలకు పరామర్శ
- సిపిఎం, బీఆర్ఎస్ పార్టీ బలపరిచి గెలిచిన సర్పంచులకు సన్మానం
- కమ్యూనిస్టులతో కలిసి పోరాటాలు చేయడానికి ఎప్పుడూ ముందుంటామన్న రేగా





**పినపాక,జనవరి 03(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.అమారారం గ్రామంలో ఇటీవల తల్లి తండ్రి ఇద్దరినీ కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహమ్మద్ యాకుబ్, మహమ్మద్ గౌస్‌లను వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పినపాక మండలం కొత్తూరు కాలనికి చెందిన సోయం రేణుక ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆమెను వారి నివాసానికి వెళ్లి రేగా కాంతారావు పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై భద్రాచలం సూపరెండెంట్‌తో స్వయంగా మాట్లాడి అవసరమైన వైద్య సహకారం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు.ఇక కొత్తూరు కాలనీలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై గ్రామస్థుల వినతిని స్వీకరించిన ఆయన, స్థానిక డీఈ అధికారిని కలిసి సమస్య తీవ్రతను వివరించారు. తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను కోరుతూ, ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో సింగిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించిన రేగా కాంతారావు, అక్కడ సిపిఎం పార్టీ, టిఆర్ఎస్ పార్టీ బలపరిచి గెలిచిన సర్పంచ్ ముక్తేష్, ఉపసర్పంచ్ కిషోర్ లను ఘనంగా సన్మానించి, గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ప్రజాసేవే లక్ష్యంగా తన పర్యటన కొనసాగుతుందని ఆయన తెలిపారు. సింగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ నుండి 50 కుటుంబాలు రేగా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రతి కార్యకర్తలు కంటికి రెప్పలా కాపాడుకుంటానని రేగా హామీ ఇచ్చారు. తమకు సహకరించిన సిపిఎం పార్టీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయంలో సిపిఎం పార్టీ చేసిన కృషిని కొనియాడారు. కమ్యూనిస్టుల పోరాట ప్రతిభని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, పినపాక మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాయం శేఖర్, అమరారంసర్పంచ్ శోభారాణి, సింగిరెడ్డిపల్లి సర్పంచ్ ముక్తేష్, ఉప సర్పంచ్ కిషోర్, మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, సీనియర్ నాయకులు దాట్ల వాసు బాబు, కొండేరు రాము, మాజీ సర్పంచ్ మొగిలిపల్లి నరసింహారావు, చిన్నారి, సిపిఎం నాయకులు మడివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు దుప్పట్లు, మేకప్ కిట్ల, పంపిణీ

- ఎంపీవో వెంకటేశ్వరరావు



**పినపాక,జనవరి 03(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలోని ఎంపీపీయస్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, మేకప్ బ్రష్ కిట్లు పంపిణీ చేసిన పినపాక మండల ఎంపీఓ వెంకటేశ్వరరావు,ఈ కార్యక్రమంలోఅయన మాట్లాడుతూ, విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, పెద్దలను గౌరవిస్తూ ఆదర్శ విద్యార్థులుగా మారాలని సూచించారు. సావిత్రిబాయి పూలే జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అవమానాలు, దాడులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజల విద్య కోసం పాఠశాలలు స్థాపించి, సమాజ చైతన్యం కోసం జీవితాన్ని అర్పించిన మహానీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. “ఇక్కడి ప్రజలే నా పిల్లలు” అనే భావనతో ఆమె జీవితాంతం విద్యా వ్యాప్తి కోసం పని చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీయస్ పాఠశాల హెడ్‌మాస్టర్ ఏ. హరి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సత్రపల్లి సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎల్. రవి,గ్రామస్తులు సత్రపల్లి సారయ్య, పినపాక మండలం పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# శత వసంత ముగింపు సభను జయప్రదం చేద్దాం

- పదవులకంటే ప్రజలే ముఖ్యం
- సిపిఐ నేత నారాయణ






**చర్ల, జనవరి 3(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం సిపిఐ శత వసంత ఉత్సవాల్లో భాగంగా ప్రచార జాతాను చర్ల మండల కేంద్రం లో సిపిఐ సీనియర్ నాయకులు, జాతీయ పార్టీ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ డా.కే నారాయణ సిపిఐ జెండా ప్రారంభించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక పార్టీ కార్యాలయం నుండి వేలాది మందితో డప్పు వాయిద్యాలు కొమ్ము నృత్యాల నడుమ సభా ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం, పేదలు బడుగు బలహీన వర్గాల పక్షాన సిపిఐ నాటి నుండి నేటి వరకు అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భారత స్వాతంత్రం కంటే ముందే ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర భారతావని కోసం ఎందరో కమ్యూనిస్టు యువ కిషోరాలు ప్రాణ తర్పణం చేశారాన్నారు. నేడు దేశంలో అమలవుతున్న అనేక చట్టాలు కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమే అని, పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పేర్లు మారుస్తుందని మండిపడ్డారు. ఆర్ ఎస్ ఎస్, జన సంఘ్ లాంటి మతోన్మాద శక్తులు దేశ ప్రజల శ్రేయస్సు కోసం ఏమైనా చేశాయా అని ప్రశ్నించారు. దేశ ఐక్యత కోసం పాటు పడేది కమ్యూనిస్టులే అన్నారు. కమ్యూనిస్టులను నేడు అనేకమంది విమర్శిస్తున్నారని, కమ్యూనిస్టు పార్టీని విమర్శిస్తే సూర్యునిపై ఉమ్మి వేసిన చందంగానే ఉంటుందని చెప్పారు. గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలిసిపోతున్నాయని ఆ సమస్యను ఇరు ముఖ్యమంత్రులు పరిష్కరించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలానికి చెందిన ఐదు గ్రామ పంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేశారని, ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన కారణంగా సరిహద్దులు గజిబిజిగా ఉన్నాయని వాటిపై పాలకులు మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు అలిగి అసెంబ్లీకి రావడం లేదని, ప్రజా ధనంతో జీతభత్యాలు తీసుకుంటూ విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్న వారు చట్టసభలోకి రాకపోవటం అన్యాయమని, అలాంటి వారు వారి పదవులకు రాజీనామా చేయటం మంచిదని చెప్పారు. త్వరలో జడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, గెలుపే లక్ష్యంగా బలంగా పనిచేయాలన్నారు. ఈనెల 18న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభ జరగనుందని, ఈ సభకు దేశ నలుమూలల నుండి ప్రతినిధులు తరలి వస్తున్నారని, ముగింపు సభ విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున కదలాలని పిలుపు నిచ్చారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి మున్నా లక్ష్మి కుమారి, వీషంశెట్టి పూర్ణచంద్రరావు, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, కందుల భాస్కర్, ఫయుమ్, అడ్డగర్ల తాతాజీ, నూప తిరుపతి, పోతయ్య, పాల్వంచ రామారావు, కోటి ముత్యాలరావు చల్లా లక్ష్మీనారాయణ నాని పల్లి భద్రం, పొడియం ఆదిలక్ష్మి, మల్లం నాగేశ్వరరావు, పాలెం సత్యనారాయణ, ఎస్.కె జాకీర్, కాకర్ల అన్నపూర్ణ, ఉప్పులూరి వెంకట నరసమ్మ, కోడిరెక్క రాజారావు, సర్పంచ్లు నూపా సునీత, శ్యామల తిరుపతి రావు, ఉప సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో డాక్టర్ మట్టా దయానంద్ జన్మదిన వేడుకలు

- ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్





**కొత్తగూడెం సింగరేణి, జనవరి 3 – ప్రజాజ్యోతి:** స్థానిక సత్తుపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సింగరేణి లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట దయానంద్ విజయకుమార్ జన్మదిన పురస్కరించుకొని సత్తుపల్లి సింగరేణి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారని మట్ట దయానంద్ డాక్టర్ గా ప్రజలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఆశా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉండి ప్రజా సంక్షేమమే తన ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు అని మాట్లాడారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గానికి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజలకు చేరువలో ఉంటూ ప్రజాక్షేత్రమే తన తమ కుటుంబముగా భావించి గొప్ప నాయకురాలు అని కొనియాడారు. సింగరేణిలో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మట్టా దయానంద్ రాష్ట్ర నాయకులు కీలక పాత్ర పోషించి యూనియన్ గెలుపుకు కృషి చేశారని తెలియజేశారు. సింగరేణి కార్మిక వర్గం స్థానిక శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ , మట్టా దయానంద్ నాయకత్వంలో సింగరేణిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు , కాంగ్రె స్ ముఖ్య నాయకులు , ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీలు నాగేశ్వర రావు , బాలాజీ ఐఎన్టియుసి ముఖ్య నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి



**బూర్గంపహాడ్, జనవరి 3 (ప్రజా జ్యోతి ):**కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై జిల్లా టాస్క్ఫోర్స్ అధికారులు దాడిచేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపహాడ్ మండలం ఉప్పుసాక,సారపాక రాజీవ్ నగర్ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ సీఐ సిబ్బందితో కలిసి మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న 9 మంది పందెగాళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.17వేల నగదు, 8 సెల్ఫోన్లు, 8 ద్విచక్రవాహనాలు, పందాలకు ఉపయోగించిన ఏడు కోళ్లను, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని నిందితులను బూర్గంపహాడ్ స్టేషన్లో అప్పగించి కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా, పేకాట, కోడిపందాలు, బెట్టింగులు వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అలాంటి వారి పట్ల పోలీసులకు లేదా 100కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టాస్క్ఫోర్స్ ఎస్సై జలకం ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

## మోతేగడ్డ ఆలయ అభివృద్ధికి తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు కృషి

- ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య



**బూర్గంపహాడ్, జనవరి 38 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోతే పట్టీనగర్ గోదావరి నదీతీరాన కొలువైన మోతేగడ్డ వీరభద్రుని ఆలయ అభివృద్ధికి తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృషిచేస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య అన్నారు. శనివారం ఆయన మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావుతో కలిసి మోతే వీరభద్రుని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లూరి మాట్లాడు తూ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ఏడాది వరదలకు కూలిపోయిన గోడ నిర్మాణంతో పాటు కల్యాణ మండప నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఇప్పటికే ధ్వజస్తంభం నిర్మాణంతో పాటు స్వామివారికి ఆభరణాలు బహుకరించినట్లు తెలిపారు. శివరాత్రి నాటికి పను లు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. తన కుమారులు ప్రవాస భారతీయులు డాక్ట ర్ తాళ్లూరి రాజాశ్రీకృష్ణ, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, కుమార్తె గొట్టిపాటి అనితారాణిల సహకారంతో అభివృద్ధి పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గుదే కృష్ణ, ఐతరాజు సీతారామరాజు, సతీష్, ఆలయ అర్చకులు వీరబ్రహ్మేంద్రస్వామి పాల్గొన్నారు.

## పెద్దమ్మగుడిలో చండీహోమ మహోత్సవం



**పాల్వంచ(టౌన్),జనవరి 03(ప్రజా జ్యోతి ):**కేశవాపురం–జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న (పెద్దమ్మ గుడి )లో పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం వైభవంగా చండీహోమం నిర్వహించారు.యాగశాలలో వేద మంత్రాల మధ్య హోమం,పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి.ఈ హోమంలో 17 మంది దంపతులు పాల్గొని అమ్మవారి ఆశీర్వచనం పొందారు.అనంతరం భక్తులకు ప్రసాదం,అన్నప్రసాద వితరణ చేశారు.అలాగే ఈ నెల 6వ తేదీన దేవస్థానంలో షాపులు,చీరల విక్రయం,పూలు–ఫోటోగ్రఫీ లీజుల కోసం టెండర్– కమ్–బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

## కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులపై ప్రత్యేక చొరవ




**కొత్తగూడెం సింగరేణి, జనవరి 3 – ప్రజాజ్యోతి:** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆదేశానుసారం జీఎం ప్రత్యేక చొరవతో కొత్తగూడెం ఏరియాలోని వివిధ డిపార్ట్మెంట్, గనులలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు తప్పనిసరిగా సిఎంపిఎఫ్ / ఈపీఎఫ్ నెంబర్ కలిగి ఉండి వారి నెలసరి జీతం నుండి సీఎంపిఎఫ్ / ఈపిఎఫ్ అమౌంట్ రికవరీలపై దశలవారీగా సంబంధిత అధికారులతో, సిఎంపిఎఫ్ అధికారులతో రివ్యూ మీటింగ్ ను కండక్ట్ చేసి కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా నెలసరి జీతం (సీఎంపిఎఫ్ / ఈపిఎఫ్ అమౌంట్ రికవరీ) అయి వచ్చేలా చేపట్టడం జరిగింది. తద్వారా కాంట్రాక్టు ఉద్యోగులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా మార్చి 2024 వరకు సీఎంపిఎఫ్ రికవరీ అమౌంట్ తెలియజేయు స్లిప్పులను 2025 జనవరి 1 న నూతన సంవత్సర వేడుకలలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వడం జరిగింది. అలాగే 2025 సంవత్సరంలో రికవరీ అయినా అమౌంట్ వివరాలను తెలియజేసిన స్లిప్పులను కూడా త్వరితగతిన పంపిణీ చేయుటకు కావలసిన వివరములను సీఎంపీఎఫ్ అధికారులతో చర్చలు జరపడం ద్వారా వీలైనంత తొందరలో మార్చ్ / 2025 వరకు రికవరీ అయిన సీఎంపిఎఫ్ అమౌంట్ వివరములు తెలియజేసే సీఎంపిఎఫ్ స్లిప్ లను ఇవ్వడం జరుగుతుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా సిఎంపిఎఫ్ సి–కేర్ ఆన్లైన్ పోర్టల్ లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా తమ సమస్సరాంతర బ్యాలెన్స్ ను చూసుకోవడానికి కాంట్రాక్టు ఉద్యోగుల మాస్టర్ డేటా పొందుపరచడానికి ఏర్పాట్లు చేయవలసిందిగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించడం జరిగింది. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులు ఎవరైనా ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ కు గురై ప్రాణాలు కోల్పోయినట్లయితే వారికి తప్పనిసరిగా యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ అయ్యేలా ప్రతి ఒక్కరికి హెచ్డిఎఫ్సి బ్యాంక్ నందు ఖాతా కలిగి ఉండేలా చర్యలు చేపట్టడం జరిగింది. అలాగే నూతనంగా ప్రవేశపెట్టిన ఈఎస్ఐ సౌకర్యం పై అవగాహన సదస్సు మరియు సభ్యత్వ రిజిస్ట్రేషన్ లను కొత్తగూడెం ఏరియాలోని 10 మంది అంతకన్నా ఎక్కువ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ను కలిగి 21వేల నెలసరి జీతం కన్నా తక్కువ జీతభత్యం కలిగి ఉన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యొక్క కాంట్రాక్టర్లను మరియు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అలాగే వారికి సంబంధిత సింగరేణి అధికారులు, సిబ్బంది తో ఈఎస్ఐ సౌకర్యము పై అవగాహన సదస్సును తేదీ.08.10.2025 & 09.10.2025 లలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్, కాన్ఫరెన్స్ హాల్ నందు ఈఎస్ఐసి అధికార బృందం హైదరాబాద్ వారిచే అవగాహన సదస్సుతో పాటు సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్క కాంట్రాక్టు తన దగ్గర పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి ఈఎస్ఐ సౌకర్యాన్ని లబ్ధి పొందేలా చర్యలు చేపట్టారు. తద్వారా సింగరేణి సంస్థల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి అడుగుగా ఈఎస్ఐ (ఉద్యోగుల రాష్ట్ర భద్రతా బీమా) సౌకర్యాన్ని అందించేందుకు సింగరేణి యాజమాన్యం వారు ఈ అవగాహన తన ఏర్పాటు చేశారని ఈ సౌకర్యం కేవలం కార్మికులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకూ వర్తించనుందని, దీని ద్వారా కాంట్రాక్ట్ కార్మికులు మెడికల్ సౌకర్యాలు పొందగలుగుతారని తెలియజేసారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**టేకులపల్లి,జనవరి03,ప్రజాజ్యోతి:** సంఘ సేవకురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ప్రిన్సిపల్ సప్పిడి రవీందర్ మాట్లాడుతూ నేడు మహిళలు గొప్ప స్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహించ గలుగుతున్నారంటే దానికి కారణం విద్యనే అని,స్త్రీల విద్యాభివృద్ధి,వారి హక్కుల కోసం పోరాడిన మొట్టమొదటి ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని గుర్తు చేశారు.తన భర్త జ్యోతిభాపులేను ఆదర్శంగా తీసుకొని మహిళలకు పురుషులతో సమానంగా విద్యావ కాశాలు కల్పించటానికి కృషి చేశారని కొనియాడారు.సావిత్రి బాయి పూలేను విద్యార్థులను స్పూర్తిగా తీసుకుని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ వెంకన్న, ఉపాధ్యాయ బృందం, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సి ఓ బి. రాంబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి సి ఓ, వి. బ్యూలా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**బూర్గంపహాడ్, (ప్రజా జ్యోతి ):**మండలంలోని మోరంపల్లి బంజర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు లక్ష్మీ గాయత్రి, శైలజ, పద్మావతి, ఉమా లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ బాలు, మోహన్, రవి, బాబురావు, సత్యనారాయణ నరేష్ భాస్కర్, రమ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రేగాను కలిసిన సర్పంచ్, ఉపసర్పంచులు



**బూర్గంపహాడ్, జనవరి 38 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండికి చెందిన ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు, తాళ్లగొమ్మూరు పంచాయతీ సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణిలు శనివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛంతో పాటు శ్రీసీతారామచంద్ర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ సర్పంచ్, ఉపసర్పంచ్లు గ్రామాభివృద్ధికి పాటుపడాలని, ప్రజాసమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తూ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి కనకాచారి, బీఆర్ఎస్ యూత్ నాయకులు చల్లకోటి పూర్ణ, తాళ్లగొమ్మూరు వార్డు సభ్యురాలు, నాయకులు ముత్యాల సాగర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ టి ఏ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**చర్ల, జనవరి 3(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో శనివారం ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ 2026 ఆవిష్కరణ ఆదివాసి టీచర్స్ సమక్షంలో గొంది విగ్నేశ్వర రావు, పీ జి హెచ్ ఏం ఉంజుపల్లి ఆశ్రమ హై స్కూల్ లో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భగా మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే జయంతిని కూడా ఘనంగా జరుపుకున్నారు . ఈ సందర్భంగా హెచ్ఎం విఘ్నేశ్వర రావు ఆదివాసి టీచర్స్ కి మహిళా టీచర్స్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ టి ఏ రాష్ట్ర నాయకులు బండె బోయిన సత్యనారాయణ , ఏ టి ఏ మండల అధ్యక్షుడు శ్యామల రామారావు, మండల ప్రధాన కార్యదర్శి తోకల లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షులు సోయం శేషు, ఉపాధ్యక్షులు దేశ ధనలక్ష్మి, వల్లె. వెంకట్రావు, తాటి శ్రీను , కారం తులసి, పరిష్క అరుణ, శ్రీదేవి, లక్ష్మి, గొప్ప రాణి , పూసం మౌనిక, కొమరం కోటేశ్వరరావు, శ్యామల బాలకృష్ణ, సున్నం కామేశ్వరరావు, పసుపులేటి శ్రీను, మేకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో ఫోటో సిమిలర్ ఎంట్రీ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి





**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 3, ప్రజా జ్యోతి:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఫోటో సిమిలర్ ఎంట్రీ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, ఐడీఓసీ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ, జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అత్యంత కీలకమని, ఫోటో సిమిలర్ ఎంట్రీలను బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలను సరిచేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని దశలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫోటో సిమిలర్ ఎంట్రీలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అర్హులైన ఓటర్ల వివరాలను సరిచేయాలని తెలిపారు. మ్యాపింగ్, ఫీల్డ్ వెరిఫికేషన్, డేటా అప్‌డేషన్ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి బాధ్యతతో సమన్వయంగా పనిచేసి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి



**ఇల్లందు, జనవరి 3, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసి పోడగింపు (పూసపల్లి) ప్రాజెక్టులో నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ పూనం సురేందర్, తిలక్ నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి, విజయలక్ష్మి నగర్ ఉప సర్పంచ్ గుడేల్లి రేణుక లు కోరారు. శనివారం సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియంను శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 పిట్ ఏరియాలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఓసి ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని అదేవిదంగా అభివృద్ధి చేయాలని, సొంత ఇల్లు కట్టుకున్న వారికి ప్రభుత్వం నుండి ఇంటి పట్టాలు ఇప్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడెం సామ్రజ్, ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను, దనసరి రాజు, ఉపేందర్, బాణోత్ హరిసింగ్, నెమిళ్ళ ఆజయ్, సౌజన్య, సునీత, వట్టం రాజు మోహన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ జన్మనిస్తుంది...
# హెల్మెట్ పునర్జన్మనిస్తుంది

- భద్రాచలం ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య



**భద్రాచలం, జనవరి 3,ప్రజాజ్యోతి :** మనకు అమ్మ జన్మనిస్తే హెల్మెట్ ధరించి వాహనం నడపడం ద్వారా మనకు పునర్జన్మ లభిస్తుందని భద్రాచలం ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. భద్రాచలంలో శనివారం జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆయన ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ గురించి, ఫోర్‌వీలర్ వాహనచోదకులకు సీటు బెల్టు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ వాహనాలపై ప్రయానించే సమయంలో ఇంట్లో ఉన్న మన కుటుంబ సభ్యులను మనం దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా నడపాలని, అలాగే రవాణ శాఖ సూచించే నిబంధనలను పాటించాలని కోరారు. మితిమీరిన వేగంతో నడిపే వాహనాల వలన మన ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో పాటు కుటుంబం ఇబ్బందుల్లో పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంవీఐ రాజశేఖర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

- నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం అందజేత

**భద్రాచలం, జనవరి 3,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి శనివారంను పురస్కరించుకొని ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. అదేవిధంగా విజయవాడకు చెందిన సుబ్బారావు, స్సీలక్ష్మి దంపతులు దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.

## వితంతువులకు చీరలు, దుప్పట్ల పంపిణి



**చర్ల, జనవరి 03:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో శనివారం నూతన సంవత్సరం సందర్భంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మంది వితంతువులకు ఉచితముగా చీరలు, దుప్పట్లు పంపిణి చేసారు. జి ఎస్ ఎస్ చర్ల ఏరియా నాయకులు పాస్టర్ పున్నం సొలొమోను అధ్యక్షతన చర్ల ఏరియా లోని కొత్తూరు సింగ సముద్రం, పూజారి గూడెం, లిల్లీ కాలనీ, దేవనగరం, అంబేద్కర్ నగర్, నాయకుల కాలనీ, పెద్ద పెల్లి, గన్నవరం కాలనీ, అంబేద్కర్ నగర్, రైస్ పేట గ్రామములో ఉన్న వితంతువులకు చర్ల మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం చేతులమీదుగా చీరలు, దుప్పట్లు ఉచితముగా పంపిణి చేసారు. ఈ యొక్క కార్యక్రములో సీనియర్ దైవజనులు వెలగల పేతురు గారు పూజారి లక్ష్మీనారాయణ (సొలోమోన్ ) పాస్టర్. ఇరుప ఏసుదాసు , కుషినీ ఆనంద్ రాజు ప్రభుదాసు ప్రసాద్ గారు డేవిడ్ గారు మర్రం. రూతు కనితి. రిబుక ఏక పౌల్ దేగల యేసు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**కొత్తగూడెం సింగరేణి, జనవరి 3 – ప్రజాజ్యోతి:** స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల, కొత్తగూడెం లో ఈరోజు జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండెంట్ దేవేందర్ రెడ్డి పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి సుజాత, సీనియర్ ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సీరా. ప్రసన్న లను సన్మానించడం జరిగింది. పలువురు ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలే గొప్పతనం వారి మాటల్లో విద్యార్థుల కు తెలియచేసారు. పిల్లలు పాటలతో, ఉపన్యాసాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





## నిరుపేదలకు నిత్యవసరాల వితరణ

- చిరు సాయం తృప్తినిచ్చింది - కాకర్ల బాబి





**చర్ల, జనవరి 3(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం తేగడ పంచాయతీ పరిధిలోని గల మేడివాయ కాలనీకి చెందిన క్యాన్సర్ పేషెంట్ సూదుల పెద్దలక్ష్మి డయాలసిస్ పేషెంట్ మడకం భద్రమ్మ లు గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మైరుగైన వైద్యం చేయించుకోవడానికి తగినంత ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అట్టి విషయం తెలిసిన కాకర్ల బాబి సహృదయంతో మానవత్వ దృక్పథం తో ఆ నిరుపేద కుటుంబానికి ఇరవై ఐదు కిలోల బియ్యం నిత్యవసర సరుకులను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక చిన్న సన్నివేశం నా మనసును మార్చివేసింది. గతంలో ఎందరికో వందలు వేలల్లో దానం చేసినా కలగని మనస్సు తృప్తి ఈ రోజు ఈ నిరుపేద కుటుంబాలకు చేసిన ఈ చిరు సహాయం నాకు ఎంతో తృప్తిని ఇచ్చిందని ఆయన అన్నారు. తనవంతుగా నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుంటానని ఆయన అన్నారు. అనంతరం యువ న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మనిషిలో మార్పు అనేది ఎప్పుడూ ఒకప్పుడు వస్తుంది. మార్పు చెందిన వ్యక్తి ఉజ్వలమైన తేజస్సుతో వెలుగొందుతూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో తనదైన పాత్రను పోషిస్తూ ప్రజల మన్నలను పొందుతారు అనడంలో అతిశయోక్తి లేదు అని అది నేడు కాకర్ల బాబి అందించిన అతి చిరు సహాయమే అందుకు నిదర్శనం అని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని మనస్ఫూర్తిగా బాబీ ని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ పంచాయతీ కార్యదర్శి హర్షిని గ్రామ పెద్దలు ఆళ్ల రామారావు ఏడుకొండల మురళి మామిడి రాజు బిఆర్‌ఎస్ యువ నాయకుడు పాకలపాటి సత్యనారాయణ రాజు సూదుల వెంకటేశ్వర్లు సూదుల వినయ్ , ఈ కార్యక్రమానికి కర్మ కర్త క్రియ అన్ని తనై నిరుపేదలకు తన వంతు సహాయాన్ని అందించాలనే నిరంతరం తపించే మద్ది లక్ష్మీ నరసింహా రెడ్డి కి దాత కాకర్ల బాబికి గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు తెలియజేశారు.

## సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం

- మదర్ థెరిస్సా ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి



**భద్రాచలం, జనవరి 03,ప్రజాజ్యోతి :** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని భద్రాచలం పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ కాలనీలోని కారుణ్య చిల్డ్రన్స్ ఆశ్రమంలో శనివారం విద్యార్థులకు సుమారు రూ. 10 వేల రూపాయలు విలువైన నిత్యావసర వస్తువులను ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కొప్పుల మురళి మాట్లాడుతూ, నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం, మహిళా విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్యనే ఆయుధంగా చేసుకుని సమానత్వం కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న మహిళా ఉపాధ్యాయులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమంలోని పిల్లలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చేరదీసి, వారికి ఆశ్రయంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు సునీల్ సేవలను మురళి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బంద సాయికుమార్, బూరం నవీన్ కుమార్, కోమటిరెడ్డి చైతన్య, జిలకర నాగరాజు, ఆశ్రమ నిర్వాహకులు సునీల్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 6న బంజారా సర్పంచు, ఉపసర్పంచులకు సన్మానం

- జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం




**కొత్తగూడెం, జనవరి 3(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బంజారా సర్పంచు, ఉపసర్పంచులకు, ఈనెల ఆరో తారీకు మంగళవారం జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్ లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బంజారా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ తెలిపారు. శనివారం లక్ష్మీదేవి పల్లి మండలంలోని జేఏసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బంజారా సర్పంచ్లు ఉప సర్పంచ్లు దంపతులుగా హాజరై సన్మాన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమానికి బంజారా ప్రజా ప్రతినిధులు,ఉపాధ్యాయ సంఘ నాయకులు, స్థానిక వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుల సంఘాల నాయకులు, జాతీయ నాయకులు,రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు,మండల గ్రామ స్థాయి నాయకులు ఈ కార్యక్రమానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు. బంజారా సంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి గూగులోత్ కేశవ నాయక్, ట్రెజరర్ బానోతు రమేష్ నాయక్, సాదు సంఘాల జిల్లా అధ్యక్షులు జేఏసీ నాయకులు, బానోత్ గణేష్ సాదు, మహిళా కో కన్వీనర్ బట్టు మంజుల, తేజావత్ రాములు నాయక్, జేఏసీ కో కన్వీనర్లు గుగులోత్ చందర్, గుగులోతు బద్రు, బానోత్ మోహన్, లావుడియా హనుమంతు, మాలోత్ గాంధీ, సోషల్ మీడియా ఆర్గనైజర్ గుగులోత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్
- తెల్లవారుజామున ఎంఎంసీ కాలనీ,
- డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో పోలీసుల విస్తృత సోదాలు
- ఒకేసారి 270 ఇండ్లల్లో తనిఖీలు





**భద్రాచలం, జనవరి 3,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 4.30 గంటల నుండి 7.30 గంటల వరకు మూడు గంటల పాటు భద్రాచలంలోని ఎంఎంసీ కాలనీ, డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇండ్లల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం సుమారుగా 270 ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలను,06 ఆటోలను,ఒక ట్రాలీను సీజ్ చేశారు. అనంతరం కాలనీల్లో నివసించే స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏఎస్పీ విక్రాంత్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట,వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా,జూదం, కోడిపందాలు, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదన్నారు. తమ కాలనీల్లోకి కొత్తగా ఎవరైనా వ్యక్తులు అద్దెకు వస్తే ఇంటి యజమానులు వారి ఆధార్ కార్డు, చిరునామాలను సేకరించి పెట్టుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఇన్స్‌పెక్టర్ నాగరాజు,ఎస్సెలు తిరుపతి,స్వప్న,సతీష్,శ్యామ్,సీఆర్ పిఎఫ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## దమ్మపేటలో మానవత్వాన్ని ముంచేసిన దారుణం

- చిన్నారుల భద్రతపై ప్రశ్నార్థకం
- బంధాల మధ్యే మృగత్వం
- సమాజాన్ని షాక్‌కు గురిచేసిన దారుణం
- చిన్నారిపై దారుణ లైంగిక వేధింపులు
- బాలల లైంగిక నేరాల చట్టం (పోక్సో) కింద కేసు



**దమ్మపేట జనవరి 03(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలో చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన యావత్ సమాజాన్ని షాక్‌కు గురిచేసింది. పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన ఏడో తరగతి చిన్నారిపై, ఆమెకు అత్యంత దగ్గరి బంధువే లైంగికంగా వేధింపులకు పాల్పడటం మానవత్వాన్ని మంటగలిపిన నేరంగా మారింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి కేసును సీరియస్‌గా తీసుకుని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత బాలికకు చట్టపరమైన పూర్తి రక్షణ కల్పించడంతో పాటు, అవసరమైన వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై స్పందించిన ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి మాట్లాడుతూ, "చిన్నారులపై జరిగే లైంగిక నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. నిందితుడు ఎవరైనా సరే చట్టం ముందు తలవంచాల్సిందే. కేసును వేగంగా దర్యాప్తు చేసి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు.చిన్నారిని కాపాడాల్సిన బంధాల మధ్యే ఇలాంటి హేయమైన నేరాలు జరగడం సమాజానికి సిగ్గుచేటుగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేసి, పిల్లల భద్రతపై మరింత అప్రమత్తత అవసరమని హెచ్చరిస్తోంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మనం ప్రజలకు చేసే సేవ క్షేత్రస్థాయిలో కనిపించాలి... సర్పంచ్ కుంజా వినోద్
- డంపింగ్ యార్డ్, పాఠశాలల్లో తనిఖీలు





**ములకలపల్లి, జనవరి 03, ప్రజాజ్యోతి :** జగన్నాధపురం పంచాయతీ సర్పంచ్ కుంజా వినోద్ శనివారం పంచాయతీ పరిధిలోని చంద్రుకుంట, రాజాపురం, జగన్నాధపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గ్రామస్తులతో నేరుగా మమేకమై వారి అవసరాలు, సమస్యలపై చర్చించారు. చంద్రుకుంట గ్రామంలోని పైబజారు ప్రాంతానికి తాగునీటి సరఫరా అందడం లేదని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యను వెంటనే స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు తెలియజేశారు. రెండు నుంచి మూడు రోజుల్లో మంచి నీటి బోరు ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జగన్నాధపురం డంపింగ్ యార్డ్‌ను సందర్శించి, అక్కడ తడి—పొడి చెత్తలను వేరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. తదుపరి జగన్నాధపురం హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్ల తలుపులు సరిగా లేవని విద్యార్థులు తెలియజేయగా, సర్పంచ్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరింపజేశారు. పాఠశాల అవరణం పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను డస్ట్‌బిన్‌లలోనే వేయాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పామర్తి కృష్ణ, నాయకులు రామాచారి, కటారపు వెంకట్రావు, యాకుబ్ పాషా, గాదేగోని సతీష్‌గౌడ్, కూరం లోకేష్, బైట రాము, కణితి వీరప్రసాద్‌తో పాటు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ అభివృద్ధికి కృషి





**ఇల్లందు, జనవరి 3, ప్రజాజ్యోతి:** ఇల్లందు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో అధికారులు, పాలకవర్గం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు స్పష్టం చేశారు. శనివారం స్థానిక దేశ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర మార్కెట్ చైర్మన్ ల సంఘం రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నికైన ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు ను పాలకవర్గం సభ్యులు, మార్కెట్ అధికారులు, ఉద్యోగులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య అశోక్ రాజీనామాను పాలకవర్గం అమోదం తెలపడం జరిగింది. అతని స్థానంలో మరో డైరెక్టర్ నియామకం ఎమ్మెల్యేదే తుది నిర్ణయమని పాలకవర్గం తీర్మానం చేశారు. మార్కెట్ ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యమని చైర్మన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రేడ్ 3 సెక్రటరి నరేష్ కుమార్, సూపర్వైజర్ శ్రీనివాసరావు, మార్కెట్ వైస్ చైర్మెన్ బిజ్జా వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బొల్లి రాజు, మాళోత్ బావుసింగ్, కుంజా వసంతరావు, గుగులోత్ గబ్రు, ఊకె బుచ్చయ్య, బానోత్ జింకు, భుక్యా శివలాల్, జిగట వెంకన్న, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్

- నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి



**దమ్మపేట జనవరి. 03 (ప్రజాజ్యోతి ):** రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం దమ్మపేట మండలం, మందలపల్లి క్రాస్ రోడ్ వద్ద దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారు, అలాగే వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు లేకుండా ఉన్న వాహనాలను గుర్తించి, మొత్తం 30 వాహనాలకు చలానాలు విధించారు.ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రస్తుత పరిస్థితుల్లో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, రోడ్డు ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం గురించి పోలీసులు వివరించారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి, అదనపు ఎస్ఐ బాలస్వామితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# దమ్మపేట గ్రామ పరిపాలన అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం

- తోలెం చంద్రావు అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎంపిక



**దమ్మపేట జనవరి. 03 (ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలంలోని గ్రామ పరిపాలన అధికారుల సంఘం అధ్యక్ష పదవి ఎన్నికలు శనివారం తహసిల్దార్ కార్యాలయం, దమ్మపేటలో సాఫీగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో సభ్యులందరి సమక్షంలో ఏకీభవించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా తోలెం చంద్రావు, ఉపాధ్యక్షులుగా పూజారి వీరభద్రమ్మ, సెక్రటరీగా వెలవెల అనంతమ్మ, ట్రెజరర్‌గా పూనం రామకృష్ణ, సలహాదారుగా కుంజా పాపయ్య, కల్చరల్ యాక్టివిస్ట్‌గా పూనం సూరయ్య ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుగా పూనం వెంకటలక్ష్మి, తెల్లం శ్రీలక్ష్మి, రెడ్డి నరసింహారావు, పూరి వెంకటేశ్వరరావు, సున్యం భీమయ్య, కుందమల్ల శ్రీనివాసరావు, పుట్టి గోపయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు అభినందిస్తూ, గ్రామ పరిపాలన అధికారుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ముువ్వ విజయబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ పగడాల రమాదేవి ,రాంబాబు



**దమ్మపేట జనవరి. 03 (ప్రజాజ్యోతి ) :** దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు,ఉప సర్పంచ్ అంగోతు శ్రీనివాసరావులు నూతన సంవత్సర సందర్భంగా టిజిఐడిసి (తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) చైర్మన్ మువ్వ విజయబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు చిన్నశెట్టి యుగంధర్, పార్టీ నాయకులు మల్ల చిన్న, సాయిల నర్సి, రొయ్యల కుమార్ పాల్గొని దమ్మపేట ప్రాంతంలోని చెరువుల అభివృద్ధి అంశాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే నీటి వనరుల అభివృద్ధికి సహకరించాలని వారు కోరగా, మువ్వ విజయబాబు సానుకూలంగా స్పందించి, త్వరలోనే చెరువుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

- మహిళల విద్య కోసం జీవితాంతం పోరాడిన మహనీయురాలు పూలే
- పూలే ఆశయాలను యువత కొనసాగించాలి
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్

**ములకలపల్లి, జనవరి 03, ప్రజాజ్యోతి:** మహిళల చదువు, స్వాభిమానమే లక్ష్యంగా జీవితాంతం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే ఆశయాలను నేటి విద్యార్థులు, యువత కొనసాగించాలని సీపీఐ జిల్లా రాష్ట్ర సమితి సభ్యులు నరటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ని సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే 19వ శతాబ్దపు అజ్ఞానపు చీకట్లను చీల్చి మహిళలకు విద్య అనే ఆయుధాన్ని అందించారని అన్నారు. అణగారిన వర్గాలు, బాలికలు, వితంతువులకు విద్య, గౌరవం, స్వేచ్ఛ కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలపై పోరాడిన సావిత్రిబాయి, మగవారికే పరిమితమైన విద్యను మహిళలకు అందుబాటులోకి తెచ్చిన తొలి తరం స్త్రీవాదిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరటి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి, సీపీఐ నాయకులు మిరియాల వెంకన్న, పసుపులేటి లక్ష్మిపతి, రావుల రమేష్, నాకిరికంటి నర్సారావు, సాయి జగదీష్, నల్లి నాగరాజు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమంలో రజాక్ జన్మదిన వేడుకలు





**కొత్తగూడెం సింగరేణి, జనవరి 3 – ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ నాయకుడు ఎంఏ రజాక్ జన్మదిన వేడుకలను శనివారం చమన్ బస్తి అనాథ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసుల వెంకట్ మాట్లాడుతూ... ఎంఏ రజాక్ గారు విద్యార్థి దశ నుండి చురుగ్గా రాజకీయాలలో ముందంజలో ఉండేవాడని, జూనియర్ కాలేజీలో ఎన్ఎస్యూఐ విద్యార్థిగా తన ప్రయాణం సాగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకట్ , శ్రీరాములు కాంగ్రెస్ నాయకులు చెమన్ బస్తి యూత్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది